క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప అర్బన్ పరిధిలో అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడప అర్బన్ సీడీపీఓ సునంద ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు నబికోట-2 ఓహెచ్, ఆయా పోస్టులకు రజక కాలని-బీసీ-బి, సాయిపేట 8వ వార్డు-బీసీ-ఈ, సాయిపేట 9వవార్డు-ఓసీ, ఎస్ఆర్ బ్యాక్-27వ వార్డు-ఈడబ్ల్యూయస్, సున్నపుబట్టీలు-3- 8వ వార్డు-బీసీ-బి పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈనెల 27లోగా ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని, 28న ఉదయం 11 గంటలకు కడప ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని వివరించారు.

ఘనంగా గంగమ్మ జాతర

కడప కార్పొరేషన్: నగరంలోని 9వ డివిజన్ జయనగర్ కాలనీలో వెలసిన గంగాదేవి అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. సోమవారం రాత్రి జరిగిన అమ్మవారి ఊరేగింపులో మేయర్ సురేష్‌బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అమ్మవారి రథాన్ని లాగారు.

వర్క్ టు రూల్ పాటిస్తాం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదివరకు వర్క్ టు రూల్ పాటిస్తామని రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించేవరకు ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో తమ నిరసనలు కొనసాగుతాయన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ కార్యకలాపాలు, సంక్షేమ పథకాలు అమలుకు ఆటంకాలు లేకుండా చూసుకుంటామని తెలిపారు. ఏపీ అమరావతి జేఏసీ చైర్మన్ జీవన్ చంద్రశేఖర్, యూనియన్ నాయకులు కృష్ణకుమార్, రొనాల్డ్ పాల్గొన్నారు.

రంజాన్‌లో రాత్రివేళ హోటల్స్‌కు అనుమతివ్వాలి

కడప కార్పొరేషన్: రంజాన్ మాసంలో హోటల్స్ రాత్రివేళ 12 గంటల వరకూ తెరిచి ఉంచేందుకు అనుమతి ఇవ్వాలని కడప హోటల్స్, ఫుడ్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు రషీద్‌ఖాన్ కోరారు. మంగళవారం కలెక్టర్ విజయ్ రామరాజును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు రషీద్‌ఖాన్ తెలిపారు. అసోసియేషన్ ఉప కోశాధికారి కిరణ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యను ప్రోత్సహించాలి

కడప రూరల్: విద్యార్థులను ప్రతి ఒక్కరూ తమకుతోచిన రీతిలో ముందుకు వచ్చి ప్రోత్సహించాలని ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ తెలిపారు. మంగళవారం దారుల్ హసనాత్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. పేద విద్యార్థుల ప్రతిభను గుర్తించి దారుల్ హసనత్ ఎడ్యుకేషనల్ ట్రస్టు బహుమతులు అందజేయడం సంతోషదాయకంగా ఉందన్నారు.

వైవీయూ దూరవిద్యలో ఎంబీఏ కోర్సు ప్రవేశపెట్టాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో త్వరలో నిర్వహించనున్న దూరవిద్య విధానంలో ఎంబీఏ కోర్సును కూడా ప్రవేశపెట్టాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంగం కడప డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి, కోరారు. మంగళవారం వైవీయూలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరం నుంచి విశ్వవిద్యాలయంలో దూరవిద్య కోర్సులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎంబీఏకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య పి.ఎస్. షావల్లీఖాన్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్‌బాబులకు వినతి పత్రం అందజేశారు.

నీటి సంరక్షణ మనందరి బాధ్యత



నీటిసంరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

వైవీయూ: ప్రాణాధారమైన నీరు లేకుండా జీవజాతి మనుగడ సాగించడం కష్టమని, అత్యంత విలువైన వనరుగా భావించి నీటి సంరక్షణ చేపట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైవీయూ వీసీ జింకా రంగజనార్ధన పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా వైవీయూలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నీటిసంరక్షణపై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ , రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్ నీటి సంరక్షణా చర్యల గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి, పీఓలు ఆచార్య వి. సునీత, డా. టి. చంద్రశేఖర్, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: ఇలలో సకల జీవకోటికి నీరే జీవనాధారం.. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు కడప జల వనరులశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాజశేఖర్‌రెడ్డి, రామాంజులు పేర్కొన్నారు. మంగళవారం కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం వారి ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇంజనీరింగ్ విభాగాధిపతి లక్ష్మిప్రసాద్, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి


మరియాపురం హిందూ శ్మశాన వాటిక వద్ద మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలోని పాలెంపల్లెలో డ్రైన్ నిర్మాణం చేపట్టాలని, ఏవైనా ఆక్రమణలు ఉంటే మార్కింగ్ వేసి తొలగించాలని కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన గౌస్‌నగర్, బళ్లారి రోడ్డు, అబ్దుల్ నబీ వీధి, ఖలీల్ నగర్, నకాష్, అగాడి, మరియాపురం, అక్కాయపల్లె ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాలు వద్ద నుంచి దేవునికడప రోడ్డు వరకూ కేసీ కాలువ పక్కనున్న నాలుగు అడుగు రోడ్డు నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. మరియాపురంలో హిందూ శ్మశాన వాటికలో ప్రహరీ చుట్టూ మొక్కలు నాటించాలని, రోడ్డుకు ఇరువైపులా బెంచీలు వేయాలన్నారు. ఎస్ఈ రత్నాల రాజు, సీపీ సంజీవ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, కార్పొరేటర్లు పాకా సురేష్, బాలస్వామి రెడ్డి, షంషీర్, డివిజన్ ఇన్‌చార్జి రఫీ పాల్గొన్నారు.

అడవులను కాపాడుకుందాం

– ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్

వైవీయూ : ప్రస్తుత పరిస్థితుల్లో అడవులను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ సూచించారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాలలో ప్రపంచ అటవీ దినోత్సవం, జలసంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. వై. సావిత్రిలు మాట్లాడుతూ అడవుల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించడంతో పాటు వాటి పరిరక్షణకు అందరూ సహకారం అందించాలని కోరారు. అనంతరం జలసంరక్షణ గురించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. పి. రవిశేఖర్, ఎం.బి. సురేష్‌బాబు, శివరామకృష్ణ, కల్పన, నరసింహారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరించడం సరికాదు


మాట్లాడుతున్న సయ్యద్ నజీర్ అహ్మద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ చరిత్రను ఇటీవల వక్రీకరించి తప్పుడు సమాచారంతో చూపడం సరికాదని.. ఆ విధంగా చేస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నజీర్ అహ్మద్ తెలిపారు. మంగళవారం భారత స్వతంత్ర్య పోరాట చరిత్ర సమాఖ్యతకు నిదర్శనం అనే అంశంపై కడప నగరంలోని బిల్టప్ సర్కిల్ వద్దగల అస్మత్ కల్యాణ మండపంలో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇటీవల కొంతమంది చరిత్రకారుల చేత చరిత్రను వక్రీకరించి రాయిస్తున్నారని, ఇలా రాయించడం వల్ల దేశ ప్రజలకు తప్పుడు సమాచారం వెళుతుందన్నారు. ఆరోజు దేశ ఐక్యతకోసం ప్రాణాలను త్యాగం చేసిన వారి చరిత్ర ప్రజలకు తెలియకపోతే భవిష్యత్ తరాలకు తప్పుడు సమాచారం వెళుతుందన్నారు. ఎస్ఆర్‌సీ జేఏసీ కన్వీనర్ బాబుభాయి, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్‌బాష, న్యాయవాది ఎండీ అలీఖాన్, నజీర్‌బాష, ఫక్రుద్దీన్, ఫయాజ్, మహబూబ్‌బాష, మైనుద్దీన్, ఆరీఫ్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

మియా మసీదు పునఃనిర్మాణానికి సాయమందించండి


మసీదు పునఃనిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మత పెద్దలు

కడప కార్పొరేషన్: బాబా సాహెబ్ మియా మసీదు పునఃనిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని, తద్వారా అల్లాహ్ ఆశీర్వాదాలు పొందాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. మంగళవారం 37వ డివిజన్ సాయిపేట పరిధిలో మసీదు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ బాబా సాహెబ్ మియా మసీదు ఎంతో ప్రాచీనమైనదని, వందల సంవత్సరాల చరిత్ర కలిగి ఉందన్నారు. మసీదు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సాయమందించేందుకు సహకారం అందిస్తాననన్నారు. మార్కెట్ యార్డు వైస్ ఛైర్మెన్ ఇబ్రహీం మియ్యా,కార్పొరేటర్లు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు



కడప కల్చరల్: కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రాగి జావ పిల్లలకు పోషకాహారం

కడప కార్పొరేషన్: 'జగనన్న గోరుముద్ద' ద్వారా బడి పిల్లలకు పోషకాహారం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఉదయంపూట రాగి జావ కూడా అందించడం అభినందనీయమని 23వ డివిజన్ కార్పొరేటర్ తుంగా విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి అన్నారు. మంగళవారం నాగరాజుపేట మున్సిపల్ హైస్కూల్ నందు పిల్లలకు రాగిజావ పంపిణీ చేశారు. హెచ్‌ఎం కవితా సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్: అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక తెలిపారు. మంగళవారం స్థానిక ప్రకాశ్‌నగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ఏప్రిల్ 3వ తేది వరకు పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

డీఏ ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కరువుభత్యం డీఏను వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాం సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కడప జిల్లా పరిషత్తు ఆవరణలో నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భాస్కర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.